క్లుప్తంగా

ముగ్గురమ్మల ఆలయానికి పోటెత్తిన భక్తులు



పిప్పరలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గణపవరం: గణపవరం మండలం పిప్పర గ్రామ దేవతలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఉత్సవాలు శనివారంతో ముగుస్తాయని ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు ఇందుకూరి రామకృష్ణంరాజు ప్రకటించారు. పిప్పర పరిసర గ్రామాల నుంచే కాక మండలంలోని పలు గ్రామాలనుంచి ప్రజలు పెద్దసంఖ్యలో భక్తులు ముగ్గురు అమ్మవార్లు మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాప అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మారెమ్మకు విశేష పూజలు



దండుమారెమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గణపవరం: గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో చివరిరోజైన శనివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మవారిని భక్తులు దర్శించుకుంటూనే ఉన్నారు. ఉదయం అమ్మవారికి ఆసాదులు గరగల సేవ నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవకమిటి సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: పదో తరగతి విద్యార్థులు అందరూ బాగా పరీక్షలు రాసి విజయం సాధించాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా అన్నారు. శనివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో 20 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ అమ్మన్ రాజా, ఫాదర్ కల్యాణ్‌లు ప్రత్యేక విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



నారాయణపురంలో మొక్కను నాటుతున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

ఉంగుటూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రాజ్‌మనోజు తెలిపారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ వాడకంపై ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్‌ను వాడవద్దని నినాదాలు చేశారు. నారాయణపురంలో ఎంపీడీవో రాజ్‌మనోజు ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యం మనం తీసుకునే ఆహారంలో 80 శాతం ప్లాస్టిక్ వాడకంతో వచ్చిన ఆహారమేనని, దీంతో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం మొక్కలు నాటారు. నాచుగుంటలో తహసీల్దార్ చంద్రప్రసాద్ సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్లాస్టిక్ వినియోగంపై మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి సునీత సురేష్, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చివేస్తున్న ఎస్ఐ శివాజీ, సిబ్బంది

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల వాడకం ద్వారా ప్రతి ఒక్కరికి అనారోగ్య సమస్యలు తోపాటు ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ అన్నారు. శనివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బందితో కలిసి ఎస్సై ఆర్ శివాజీ ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తగలబెట్టి ఫైళ్లన శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువులకు వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు.

ఈ తప్పు.. భావితరాలకు పెను ముప్పు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం





వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్

దెందులూరు: ఉదయం లేచింది మొదలు, పాలు, టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరణా సామాన్లు...ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరు బయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికీ డ్రెయినేజీలు, వంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం –2021 ప్రకారం 50మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారు చేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

దెందులూరు నియోజకవర్గం నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి పెదపాడు, ఏలూరు రూరల్ లాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలథీన్‌కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసి పోవాలంటే వందలు, వేల ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేదాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీ బ్యాగ్‌లకు జనపనార, క్లాత్ కాగితంతో తయారు చేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతి వినియోగం పర్యావరణానికే కాదు, మానవాళి ఆరోగ్యానికి హానికరమే. ప్లాస్టిక్ నిషేధాన్ని సమాజిక బాధ్యతగా భావిస్తే కాలుష్యాన్ని అధికమించగలం. దీనిపై ప్రజలు చైతన్య వంతులు కావాలి

– డాక్టర్ సుందర్ కుమార్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

సహజ గుణాన్ని కోల్పోతున్న భూమి



పర్యావరణ కాలుష్యంతో భూమి నానాటికి సహజ గుణాన్ని కోల్పోతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకెళితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించొచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి

– చుక్కా అవినాష్ రాజ్, లయన్స్ క్లబ్ డైరెక్టర్, పెదవేగి

బెయిలీ వంతెన మరమ్మతులకు నిధులు విడుదల చేయండి

భీమడోలు: గోదావరి కాల్వపై నిర్మించిన బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆర్అండ్‌బీ శాఖ నిధులు వెచ్చించి మరమ్మతులు చేయాలని భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వట్టి భాస్కర్‌కు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. గుండుగొలను కాల్వపై నిర్మిస్తున్న పక్కా వంతెన నిర్మాణం వెంటనే నిలిపివేయాలని కేంద్ర జలరవాణా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో ఆ వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. దీనితో వంతెన నిర్మాణం ఎప్పటికీ పూర్తి అవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే ఎమ్మెల్యేలు, ఏలూరు ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. ఈ క్రమంలో కాల్వలో రెండేళ్ల క్రితం నిర్మించిన బెయిలీ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలతో మరమ్మతులకు గురైంది. ఆ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని గత ఏడాది అక్టోబర్‌లో ఆర్ అండ్ బీ శాఖకు విన్నవించినా నిధుల కొరత సాకు చూపుతూ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ఈ వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అందుకు నిధులను మంజూరు చేయాలని ఆయన ఫిర్యాదు చేశారు.

నేడు ఏలూరు మండల పరిషత్ సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు అధ్యక్షత వహిస్తారని, గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చిస్తారని పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంటెంట్ జీవీ గిరిధర్, ఎన్‌సీసీ కమిటి సభ్యులు



నారాయణపురం డిగ్రీకళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణలో వినియోగదారుల హక్కుల కమిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పూళ్లలో శనివారం జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ ఆదేశాల మేరకు జిల్లా వైస్ చైర్మన్ తుమ్మూరు అంజనేయులు ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జీవీ గిరిధర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుని అవగాహన లేమిని ఆసరాగా తీసుకుని వ్యాపార సంస్థలు మోసం చేస్తున్నాయని, నేటి సమాజంలో వినియోగదారులు ఎక్కువగా మోసం పోతున్నారని, కొనుగోలు చేసుకున్న తరుణంలోనే తప్పనిసరిగా గడువు తేదీ, నాణ్యతా ప్రమాణాలను తెలుసుకుని కొనాలన్నారు. దుకాణదారుడు మోసం చేసినట్లయితే వినియోగదారుల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నిమ్మల శ్రీనివాస్, కాసాని రామకృష్ణ, ఉప్పు గంగాధర్, బి.తులసీరావు, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారులు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా రవి శ్రీధర్ మాట్లాడుతూ వినియోగదారుల యొక్క రక్షణ చట్టం యొక్క ప్రాముఖ్యతను, వినియోగదారుల సమస్యలను పరిష్కరించే మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జి.రామ్మోహన్, ఐ.లావణ్య, జి.రఘునాథ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం



సరిపల్లెలో స్వచ్ఛ ప్రదర్శన చేస్తున్న అధికారులు

గణపవరం: పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని, ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని గణపవరం ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం గణపవరం మండలం సరిపల్లెలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేశారు. ప్రతీ పౌరుడు స్వచ్ఛ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా, తడిపొడి చెత్తలను వేర్వేరుగా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చనుమూరి లక్ష్మీదుర్గాభవాని, కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో: గణపవరం పీహెచ్‌సీలో స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో చెత్తా చెదారం తొలగించారు. ప్రజలంతా స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహించాలని, మురుగునీటి కుంటలు లేకుండా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరీక్షలు ముగిశాయి. విద్యార్థుల్లో ఆనందహేల



ఆర్టీసీ బస్సులో విజయకేతనం చూపుతున్న ద్వారకాతిరుమల గురుకుల బాలికలు



పరీక్ష ముగియగానే సంతోషంగా బయటకు వస్తున్న బాలబాలికలు

భీమడోలు: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు శనివారం కెమిస్ట్రీ, ఆర్ట్స్ గ్రూపులకు చెందిన పరీక్షలు రాశారు. చివరి గంట మోగగానే బయటకు వచ్చి కేరింతలు కొట్టారు. ఏడాదింతా చదువులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న విద్యార్థులు పరీక్షలు ముగియడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సుమారు 700 మంది పరీక్షలు రాశారు. రెండు ఏళ్ల పాటు ఒకే చోట చదువుకున్న మనమంతా జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని కోరుకుంటూ ఒకరినొకరు వీడ్కోలు పలికారు. భీమడోలు వేంకటేశ్వర జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో పోలసానిపల్లి, ద్వారకాతిరుమల గురుకుల కళాశాలలకు చెందిన బాలికలు పరీక్షలు రాశారు. వారితో పాటు భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన వివిధ ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాసారు. అదే పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. పోలసానిపల్లి, ద్వారకాతిరుమల గురుకుల బాలికలు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ యాజమాన్యం వారికి బస్సులను ఏర్పాటు చేసింది. దీనితో పరీక్షలు ముగియడంతో వారంతా బస్సుల్లో కూర్చుని సందడి చేసారు. వారంతా విజయచిహ్నాన్ని చూపుతూ సంతోషం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులతో తన ఆనందాన్ని పంచుకున్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములవుదాం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ కొడాలి అనురాధ

పెదవేగి : స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో గ్రామ సర్పంచ్ గుంజా క్రీస్తు మణి, ఉపసర్పంచ్ చింతమనేని శివగోపాల్ నేతృత్వంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ,డివిజనల్ పంచాయతీ అధికారి కె పీ చంద్ర శేఖర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఓ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామాన్ని ప్రతి పల్లెను స్వచ్ఛ గ్రామం, స్వర్ణ పల్లెలు గాను తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ– ఆంధ్ర స్వర్ణ– ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. సమాజంలో చాప క్రింద నీరులా ప్లాస్టిక్ వస్తువులు ప్రమాదకరంగా వ్యాపిస్తున్నాయన్నారు. మార్కెట్ లో కొనుగోలు చేసే ప్రతి నిత్యావసర వస్తువు ప్లాస్టిక్ పదార్థంతో తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ అండ్ పిఆర్ డీ షరీఫ్, కార్యదర్శి సాయి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. 2024–25 సంవత్సరంలో బీసీ–ఎ, బీసీ–బి, బీసీ–సీ, బీసీ–ఇ వర్గాల వారికి స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీ, మేదర / కుమ్మరి శాలివాహన వాహన వారికి వృత్తి పరంగా బుట్టల అల్లకం / కుండల తయారీకి, ఆర్య వైశ్య, రెడ్డి, కమ్మ, బ్రాహ్మిణ్, ఈబీపీ సామాజిక వర్గాల వారికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మశీ పథకాల కింద బ్యాంకులోను, ప్రభుత్వ సబ్సిడీ ఆర్థిక సాయం మంజూచేస్తారని పేర్కొన్నారు. కాపు, తెలగ బలిజ, ఒంటరి సామాజిక వర్గాల వారికి స్వయం ఉపాధి, గ్రూపు ఎంఎస్ఎంఈ క్రింద బ్యాంకు లోను, ప్రభుత్వ సబ్సిడితో ఆర్థిక సాయం మంజూరవుతుందని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెలల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం



పోలసానిపల్లిలో మానవహారం చేస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, సర్పంచ్ షేక్ రహీమాబేగం, వివిధ శాఖల సిబ్బంది

భీమడోలు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. మండల వ్యాప్తంగా 13గ్రామ పంచాయతీల్లో స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సర్పంచ్ షేక్ రహీమాబేగంలు బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలతో రాష్ట్రీయ రహదారిపై మానవహారం చేశారు. 8వ వార్డు సభ్యుడు నానాది రాజారత్నం తన ఆర్థిక సాయంతో 10 కుర్చీలను అందజేసారు. సూరప్పగూడెంలో పాఠశాలలోని చిన్నారులచే మంచినీటి ట్యాంకుపై నినాదాలు రాయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూర్మా లక్ష్మీ, కార్యదర్శులు కేవీఎం తనూజ, జయరామకృష్ణ, మురళీ, ముత్తయ్య, వార్డు సభ్యులు భీమడోలు రామకృష్ణ, నానాది రాజారత్నం, మడికే కనకదుర్గ, ఈతకోట ఆనంతమ్మ, పెద్దలు పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, పటేల్, శేషపుగిరి, మద్దు శ్రీను, యర్రంశెట్టి సతీష్, గంజి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని పలువుకు వక్తలుతెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆరవింద శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి కె విశ్వేశ్వరరావు, స్వచ్ఛ ఆంధ్ర కమిటీ సమన్వయకర్త రెడ్డియ్య, ఎన్ ఎస్ ఎస్‌పోగ్రాం ఆఫీసరు హిప్సిబా, అధ్యాపకులు కొండారవి, రాజు మణింద్రరావు, బాబూరావు, వెంకటేశ్వర్లురెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలి

పెదవేగి : పెదవేగి మండలాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దుదామని మండల తహసీల్దార్ భ్రమరాంబ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో బాగంగా మండల కేంద్రమైన పెదవేగిలో స్థానిక సర్పంచ్ గ్రామస్తులతో సచ్చివాలయ సిబ్బందితో కలిసి పెదవేగి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ మాటున దాగి ఉన్న క్యాన్సర్ మానవ మనుగడను మింగేస్తుంది అని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఏర్పడే ముప్పును ప్రతి ఒక్కరూ గుర్తించి ప్లాస్టిక్ నీ నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెదవేగి మండలాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పులవర్తి శ్రీనివాస్, పి డి ఓ పులవర్తి శ్రీనివాస్,ఎస్ ఐ రామకృష్ణ, ఆర్ ఐ కె ఐ వి సారథి, రెవిన్యూ సిబ్బంది పెదవేగి గ్రామ పంచాయతీ కార్యదర్శి కె వర ప్రసాద్,పెదవేగి మండల కేంద్ర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ ఎ ఎస్ కళాశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఉంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జాబ్‌మేళాలో 14 మందికి కొలువులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో శనివారం స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మందికి ఉద్యోగావకాశాలు లభించాయలని కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత మొబైల్స్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, పేటీఎం కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 31 మంది యువత హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి మధు భూషణ్ రావు పాల్గొన్నారు.